# తృప్తి

## యం.డి.యస్దాన్

"జానకీ! టిఫిన్ రెడియా?" డైనింగ్ టేబుల్ ముందు కూర్చుంటూ కేక వేశాను.

"అయిపోయింది, అయిదు నిమిషాలు" వంటింట్లో నుంచి జవాబిచ్చింది. కూర్చొని పేపరందుకున్నాను.

పేపరులో ఏముంటుంది, రాజకీయకుళ్ళు తప్ప. ప్రభుత్వం మీద ప్రతిపక్షాలూ, ప్రతిపక్షాల మీద ప్రభుత్వం ఆరోపణలతోనే సగం పేపరు నిండిపోయింది.

అయితే పేపరులో క్రింద ఒక పక్కకు వున్న చిన్న ప్రకటన నన్ను ఆకర్షించింది.

"ఎయిడ్స్ కంటే భయంకరమైన లంచగొండితనాన్ని నిర్మూలించుటకు మాతో సహకరించండి. ఇట్లు ఎ.సి.బి"

అవినీతి నిరోధక శాఖ ఇచ్చిన ప్రకటన అది.

భారంగా నిట్టూర్చాను నేను. ప్రభుత్వ ఉద్యోగస్థుడినైన నేను ఏనాడూ లంచం తీసుకొని ఎరుగను. ఈ విషయంలో మాత్రం ఒకింత గర్వపడుతుంటాను.

తొమ్మిదయినట్లు గోడ గడియారం మ్రోగింది.

"జానకీ! త్వరగా పత్రా, ఆఫీసుకు టైమవుతోంది."

"అబ్బా...బ్బా...వస్తున్నానండీ! నాకుండేది రెండు చేతులే. ఉదయం లేస్తే ఒకటే తొందర. ఈయనగారు ఆఫీసుకు పది నిమిషాలు ఆలస్యంగా వెళితే ఏదో కొంపలు అంటుకుపోయినట్టు తెగ బాధ పడిపోతుంటారు" ఇడ్లీలు తెచ్చి విసురుగా డైనింగ్ టేబుల్ మీద పెడుతూ అంది.

మా పెళ్ళి జరిగినప్పటి నుంచి చూస్తున్నాను. జానకిది ఇదే తంతు. ఆమె తెగ కష్టపడిపోతున్నట్టు "పని ఒత్తిడి ఎక్కువ, కాస్త నడుం వాల్చేదానికి కూడా తీరికుండదు ఈ ఇంట్లో" అంటూ రుస రుసలాడుతుంటుంది.

ఆ మాటకొస్తే ఈ ప్రపంచంలో పని వత్తిడి లేనిదెవరికి? ఫ్యూన్ నుంచి పి.ఎమ్ వరకూ ఎవరికి తగ్గ శ్రమ వారికుంటుంది. ఈ విషయం నేనప్పుడప్పుడు జానకితో అంటాను. "గయ్..."మంటూ నా మీదకు వస్తుంది.

అందుకే వీలైనంత వరకూ ఆమెతో నెమ్మదిగా వుంటూ సర్దుకుపోతుంటాను. అందుకే మాది కలతలు లేని





## బిజీ అయిన రక్షిత

'ఇడియట్' చిత్రం హిట్ అయిన రక్షితను యమ బిజీ చేసింది. రక్షితను బుక్ చేసుకోవడానికి చాలా మంది నిర్మాతలు క్యూలో ఉన్నారు. అయితే స్వతహాగా కన్నడ భామ అయిన రక్షిత అటు మాతృభాష కన్నడని, ఇటు తెలుగుని రెండు కళ్ళుగా భావిస్తూ పూర్తి న్యాయం చెయ్యడానికి ప్రయత్నిస్తోంది. ప్రస్తుతం కృష్ణారెడ్డి దర్శకత్వంలో నటిస్తున్న రక్షితకి ఆఫర్ల మీద ఆఫర్లు వచ్చి పడుతున్నాయి. అయితే బేనర్, హీరో, కథలకు ప్రాధాన్యతను ఇస్తూ ఆచి తూచి అడుగువేస్తోంది కన్నడ భామ.

కాపురం అయింది. భార్యాభర్తల్లో ఎవరో ఒకరు సర్దుకుపోతేనే కదా ఆ సంసారం సాఫీగా సాగేది.

పొగలు కక్కుతున్న సాంబారును ఇడ్లీలలో పోసుకుంటూ-

"అబ్బాయి ఏడి? పిలువు టిఫిన్ చేస్తాడు" అన్నాను.

"వాడు బస్టాండ్ దాకా వెళ్ళొస్తానని వెళ్ళాడు."

"బస్టాండుకా! దేనికి?"

"దేనికేమిటి? మరచిపోయారా? స్టాఫ్ సెలక్షన్ ఎగ్జామ్ రాసేదానికి వాడు రేపు బెంగుళూరుకు వెళ్ళాలిగా, బస్సులు ఏ టైమ్‌లో వున్నాయో కనుక్కొని వస్తానని వెళ్ళాడు. వాడడిగిన రెండు వేలు రెడీ చేశారా?"

జానకన్న చివరి మాట విని పొరపోయింది నాకు. ఎగ్జామ్ రాసేదానికి బెంగుళూరుకు వెళ్ళాలి. డబ్బులు కావాలని వారం క్రితమే అడిగాడు వాడు. ఆ విషయమే మరచిపోయాను నేను. అసలే నెలాఖరు. ఇప్పుడు డబ్బులు సర్దుబాటు కావడం చాలా కష్టం. అప్పటి వరకూ కమ్మగా వున్న ఇడ్లీ రుచి కాస్తా చేదైపోయినట్టు అనిపిస్తుంటే, చేయి కడిగేశాను.

"అదేమిటి చెయ్యి కడిగేశారు?"

"ఆకలిగా లేదు" అంటూ అక్కడి నుంచి లేవబోయాను. "కూర్చోండి. కాఫీ అయినా త్రాగండి" అంటూ కాఫీ కలిపిచ్చింది. నేను కాఫీ తాగుతుంటే అడిగింది.

"వాడికి డబ్బులెప్పుడిస్తారు? వాడు బ్యాగు, యింకా ఏదో కొనాలంట. ఎక్కడికన్నా వెళ్ళాలంటే ఈ ఇంట్లో మంచి వస్తువు ఏది ఏడ్చిందని?" నా అసమర్థతను ఎత్తి పొడుస్తూ అంది.

నేను మౌనంగా కాఫీ త్రాగడం ముగించి అక్కడి నుంచి లేచి చెప్పులేసుకుంటుంటే మళ్ళీ అడిగింది.

"ఎప్పుడిస్తారో చెప్పకుండా వెళ్ళిపోతున్నారేమిటి?"

నేను దీర్ఘంగా నిట్టూర్చి అన్నాను "నెలాఖరు కదా! నా దగ్గర నీకు తెలీకుండా డబ్బులేముంటాయి? సాయంత్రం ఎక్కడైనా అప్పుగా తెచ్చిస్తానులే."

"బాగుందండీ మీ వరస. జీతం డబ్బులైపోతే అప్పు చేస్తారా? మీలా జీతాన్నే నమ్ముకొని జీవిస్తున్న జీవి ఈ ప్రపంచంలో మరెవ్వరూ ఉండరు. అర్థం లేని ఈ నిజాయితీని నమ్ముకునే కదా! ఉన్న ఇంటినమ్మి కూతురి పెళ్ళి చేశారు. ఇప్పుడు అప్పులు చేసి అబ్బాయి చదువు కొనసాగిస్తారా?"

## అవార్డుల పిచ్చి

బాలీవుడ్‌లోని హీరోయిన్‌లకు నేషనల్ అవార్డుల పిచ్చి పట్టింది. సెక్సీ హీరోయిన్లందరూ అవార్డులు పొందాలనే ఆరాటంతో కమర్షియల్ సినిమాలను వదిలేసి, ఆర్ట్‌ఫిల్మ్‌లో యాక్ట్ చెయ్యడానికి ఇంట్రెస్ట్ చూపిస్తున్నారు. ఇదే విధంగా కమర్షియల్ హీరోయిన్ టబూ ఇంతకుముందు చాందినీబార్ చిత్రానికి ఉత్తమ నటిగా నేషనల్ అవార్డ్‌ను అందుకుంది. పులిని చూసి నక్క వాత పెట్టుకున్నట్లు టబూను చూసి శిల్పాశెట్టి తాను కూడా అవార్డ్ కోసం ఒక ఆర్ట్ ఫిల్మ్‌లో నటిస్తోంది. శిల్పా ప్రయత్నం సక్సెస్ అవుతుందో లేదో చూడాల్సిందే.



"జానకీ అన్నీ తెలిసి నువ్వు కూడా ఇలా మాట్లాడితే ఎలా చెప్పు? ఎలాగో చేసి నేను డబ్బు తెచ్చిస్తాగా!"

"ఆఁ తెస్తారు. ఒక వేళ అప్పు దొరక్కపోతే ఏం చేస్తారు? నా బిడ్డ భవిష్యత్తు ఏమవుతుందో ఆలోచించారా?"

"అర్థం లేకుండా మాట్లాడకు. వాడి భవిష్యత్తు గురించి నాకు మాత్రం బెంగ లేదంటావా?"

"ఉంటే మీరిలా చేస్తారా? రిటైర్ అయ్యే వయసుకి వచ్చేశారు. మీకంటే జూనియర్లు చూడండి. ఎలా తెలివిగా సంపాదిస్తున్నారో? మీరు మాత్రం సిన్సియారిటీ చూపిస్తూ ప్రతి రూపాయి కోసం అవస్థ పడుతూ మమ్మల్ని క్షోభ పెడుతున్నారు."

"అంటే ఏమిటి నీ ఉద్దేశం? నన్ను కూడా వాళ్ళలాగా లంచాలు తీసుకోమంటావా?"

"తప్పేముంది? తీసుకోండి. వారం నుంచి మన ఇంటి చుట్టూ ఒక వ్యాపారస్తుడు తిరుగుతున్నాడు. అతని ఫైల్ మీద మీరు సంతకం చేస్తే అయిదు వేలిస్తానన్నాడు. ఆ సంతకమేదో చేసేస్తే ఇలా అప్పు ఇవ్వండని దేబిరించాల్సిన అవసరముండదు కదా! ఇవాళ అప్పు చేస్తారు. రేపు జీతం వచ్చిన తరువాత తీర్చేస్తారు. మరేదన్నా అవసరం వస్తే మళ్ళీ అప్పులు చేస్తారు. ఎంత కాలం ఇలా...? మీరు పిరికివారండి. అందరిలా ధైర్యం చేసి బ్రతకలేరు. మీ పిరికితనానికే నిజాయితీ అని పేరు పెట్టుకున్నారు."

ఇక అక్కడ ఒక్క క్షణం కూడా వుండబుద్ధికాక వెంటనే బయటకు వచ్చి సిటీ బస్సెక్కి ఓ మూలలో కూలబడ్డాను. మనసంతా గజిబిజిగా తయారైంది. జానకన్న మాటలు పదే పదే గుర్తుకు రాసాగాయి.

నిజంగా నాలో వున్నది నిజాయితీనా? లేక జానకన్నట్టు పిరికితనమా? ఆర్థికంగా చాలా వెనుకబడిన కుటుంబంలో పుట్టాను నేను. కష్టపడి చదివాను. లంచాలిచ్చో, రికమండేషన్లతోనో కాకుండా అర్హతతోనే ఉద్యోగం సంపాదించాను.

నా శ్రమకు ప్రతిఫలంగా ప్రభుత్వం జీతాలిస్తుంది.

ఒక రోజు తినీ ఒక రోజు పస్తులున్న స్టేజీ నుంచి మూడు పూటలా కడుపునిండా కూడు తినే స్థితికి కారణమైన ఈ ఉద్యోగమంటే నాకెంతో గౌరవం. ఇలాంటి ఉద్యోగాన్ని దురుపయోగం చేయాలంటే నా మనసంగీకరించడం లేదు.

ఈ ప్రపంచంలో జీవించాలంటే డబ్బు అవసరమే కానీ, అందుకోసం నైతిక విలువల్ని పక్కన పెట్టడం ఎంత వరకు సమంజసం? ఈ లోకం ఎటు వెళుతోంది? తన భర్త నిజాయితీ పరుడైనందుకు హర్షించాల్సిన భార్యే, బాధపడుతోంది.

మనిషిలో ఆశకు, అంతెక్కడుంది? పొందేకొద్దీ ఇంకా కావాలనుకుంటుంది. దొడ్డ మనసు. ఆధునికత ముసుగులో మనిషి తనకు తానే అవసరం లేని అవసరాలను సృష్టించుకుని దాని కోసం పక్కదోవ పడుతున్నాడు.

నేను దిగవల్సిన స్టేజి రావడంతో ఆలోచనల నుంచి తేరుకుని ఆఫీసువైపు నడిచాను.

ఏది ఏమైనా నా మూలంగా నా కొడుకు భవిష్యత్తు పాడవడం నేను సహించలేను. వాడు ఆ

# ముద్దులు

నిదురపట్టని కనుల
నెనరు చేతుల నద్ది
ఎద వెతల తొలగించు
చెలిమి చెమ్మల ముద్దు

తలను ఒరగ వంచి
కురుల చిక్కును తీయు
నగుమోము నవకాల
నెలత అద్దపు ముద్దు

ఎడద మబ్బుల ప్రేమ
ఏరువాకలు సాగ
నెనరు తడిపొదవుతో
చిదిమి పెట్టిన ముద్దు

సెలయేటి దరితోట
విరుల ఆవిరిపెట్టె
గాలి పెదవులమీద
గంధాలతో ముద్దు

సందె పైదలి కావి
పోక ముడులే సడలి
చందురుని రాకతో
వలువ జారిన ముద్దు

**- సాంధ్యశ్రీ**

ఎగ్జామ్ రాస్తే, అదృష్టం బాగుంటే వాడికి ఉద్యోగం రావచ్చు. ఇప్పుడు నేను డబ్బులివ్వకపోతే వాడు బెంగుళూరుకు వెళ్ళలేడు.

అప్పు తెస్తానని జానకితో గొప్పగా చెప్పాను కానీ, నెలాఖరున అప్పు చిక్కటం కష్టం, కాదు, దాదాపు అసాధ్యం. మరీ బ్రతిమాలి అడగాలంటే అభిమానం అడ్డొస్తుంది.

మౌనంగా ఆఫీసులోకి నడిచి నా సీట్లో కూలబడ్డాను.

ఒక గంట తరువాత ఆ వ్యాపారస్తుడు నా వద్దకు వచ్చి "సార్! నా ఫైల్ విషయం ఏం చేశారు?" అడిగాడు.

కోపంగా అతని వైపు చూసి ఆ ఫైల్ క్లియర్ చేయాలంటే వున్న అడ్డంకులు ఏమిటో చెప్పబోయాను. కానీ ఎత్తుగా వున్న అతని చొక్కా జేబు నా నోటికి తాళం వేసింది.

ఆ ఒక్క క్షణం నాలోని నిజాయితీని పక్కన పెట్టదలిచాను. ఆఫీసులో చనువున్న అందరి దగ్గరా అప్పు అడిగాను. ప్రతి ఒక్కరి దగ్గర నుంచీ ఒకే రొటీన్ డైలాగు వినిపించింది, 'నెలాఖరు డబ్బుల్లేవు' అని.

ఇక నా ముందు రెండే మార్గాలున్నాయి. ఒకటి ఆ వ్యాపారస్తుడి ఫైలు మీద సంతకం చేసి డబ్బు తీసుకోవడం. రెండు, దేవుడి మీద భారం వేసి మిన్నకుండిపోవడం.

అయితే ఒక్క క్షణం జానకి అన్నమాట గుర్తుకు వచ్చింది. 'మీరు పిరికివారు. మీ పిరికితనంతో నా కొడుకు భవిష్యత్తు పాడు చేయవద్దు.'

అంతే నాలో తెగింపు వచ్చేసింది. ఏదయితేనేం, నాకు నా బిడ్డ భవిష్యత్తు ముఖ్యం. దాని కోసం ఒకే ఒక్క తప్పు. వెంటనే ఫైల్ అందుకున్నాను.

కన్న ప్రేమ ఎంత ప్రమాదమైందో ఇప్పుడు అర్థం అవుతోంది నాకు. అది మనిషిని ఎంతకైనా దిగజారుస్తోంది. అందుకే కదా ఇన్నాళ్ళ నా సిన్సియారిటీని పక్కకు పెట్టగలిగాను.

సంతకం పెట్టబోతుంటే నా చేయి వణుకుతోంది.


ఆ వ్యాపారస్తుడు పేపరు చూస్తున్నాడు. అప్రయత్నంగా నా దృష్టి పేపరుకు వున్న న్యూస్ ఐటమ్ మీద పడింది.

అదే ఉదయం నేను చూసిన ఏ.సి.బి వాళ్ళ న్యూస్ అది. అంతే! నా చేతిలోని కలం జారిపోయింది.

ఫైల్‌ను అతనికి తిరిగిచ్చేస్తూ 'సారీ' అన్నాను.

నేను సంతకం చేసేస్తున్నానని తెగ సంబరపడిపోయిన అతను అలా జరక్కపోయేసరికి నా వైపు విచిత్రంగా చూసి ఏదో గొణుక్కుంటూ వెళ్ళిపోయాడు.

"దేవుడా! ఒక్క క్షణం నేను



తొందరపడివుంటే జీవితాంతం అపరాధ భావంతో కుమిలిపోయేవాడ్ని తండ్రీ!" అనుకున్నాను.

నా మనసంతా చిరాగ్గా అయిపోయింది. టీ అయినా త్రాగి వద్దామనుకుని లేచి, ఆఫీసు ఎదురుగా వున్న బంకులో టీ త్రాగాను. కొంచెం రిలాక్స్ అయి మెల్లగా ఆఫీసులోకి వచ్చాను.

ఆఫీసులో జరగరానిదేదో జరిగినట్టుంది. అందరూ ఆత్రుతతో ఏదో చర్చించుకుంటుంటే విషయం ఏమిటో కనుక్కున్నాను. విషయం విన్న వెంటనే నా తల దిమ్మతిరిగిపోయింది.

✳ ✳ ✳

సాయంత్రం ఇంటికి ఒట్టి చేతులతో వచ్చిన నా వైపు కోపంగా చూసింది జానకి.

నేను తీసిన బట్టల్లోని జేబులు చెక్ చేసింది. అందులో సిటీ బస్సు టిక్కెట్లు తప్ప మరేమీ కనిపించకపోయేసరికి నా మీద 'గయ్'మంటూ మండిపడింధి.

"ఉదయం చిలకకు చెప్పినట్లు అంతదూరం చెప్పినా వట్టి చేతులూపుకుంటూ వచ్చేశారా? నెలాఖరున ఎక్కడా అప్పు చిక్కదని తెలియదా మీకు? పోనీ ఆ వ్యాపారి ఫైలు సంగతైనా చూసి డబ్బు తెస్తారంటే అదీ చేయలేదు. ఇప్పుడెలా...మీ అర్థం లేని పట్టుదలతో నా బిడ్డ బంగారు భవిష్యత్తు పాడు కావాల్సిందేనా?"

ఆమె చెప్పిందంతా మౌనంగా విని మెల్లగా అన్నాను నేను. "జానకీ ఇవాళ నేను నువ్విచ్చిన సలహా పాటించి వుంటే ఇప్పుడు నువ్వు నన్ను చూసేందుకు జైలుకు రావాల్సి వుండేది"

నేను చెప్పింది ఆమెకు అర్థం కాలేదేమో! "అంత కాని పని నేనేం చేయమన్నాను. కొంచెం అర్థమయ్యేలా అఘోరించండి" కోపంగా అంది.

నేను ఈజీచైర్‌లో నడుం వాల్చి అన్నాను.

"ఆ తల తిక్క వ్యాపారి ఉదయం నా వద్దకు వచ్చాడు. నువ్వన్నావు చూడు, నేను పిరికివాడ్నని. ఆ పౌరుషంతో అబ్బాయి ఎగ్జామ్‌కు డబ్బులు సర్దలేని నా నిస్సాహయతా నన్ను చుట్టుముట్టి హింసిస్తుంటే, విధి లేక సంతకం పెట్టబోయాను. కానీ ఏ దేవుడు అడ్డుపడ్డాడో తెలీదు. సంతకం పెట్టలేక ఫైల్ అతనికి వాపసిచ్చేశాను.

వాడు ఆ ఫైల్ అందుకుని మా పక్క సెక్షన్‌లో వున్న మరో సీనియర్ ఉద్యోగి గుర్నాథం వద్దకు వెళ్ళాడు. డబ్బుకు ఆశ పడ్డ గుర్నాథం దాన్ని పుచ్చుకునేందుకు ఆఫీసు వెనుక పక్కకు వెళ్ళాడు. అక్కడ మాటేసివున్న యాంటీ కరప్షన్ బ్యూరో వాళ్ళు అతన్ని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు."

నా మాటలు విని ఆమె నిర్ఘాంతపోయింది.

గిల్టీ ఫీలింగ్‌తో కాబోలు తల వంచుకొని వచ్చి నా కాళ్ళ దగ్గర గచ్చుపై కూర్చుంది.

"ఏమండీ! ఆ వెధవ దగ్గర మీరు డబ్బు తీసుకుని వున్నా మీ పరిస్థితీ అంతే కదా?"

"అంతేకదా మరి! తప్పు మొదటిసారి చేస్తున్నానని చెబితే నన్ను వదిలేస్తారనుకున్నావా? లంచం తీసుకునే వాడికీ దొంగకూ ఎలాంటి తేడా లేదు. ఇద్దరూ ఏదో రోజు దొరక్క తప్పదు. విధి లేక చేశాడని దొంగనైనా క్షమిస్తారేమో కాని, లంచం తీసుకునే ఉద్యోగిని మాత్రం ఎవ్వరూ క్షమించరు. నేను అనాలోచితంగా నీ మాట వినుంటే ఇన్నాళ్ళుగా పడ్డ శ్రమంతా బూడిదలో పోసిన పన్నీరయ్యేది.

మంచి పేరూ, నమ్మకమూ సంపాదించుకోవాలంటే దశాబ్దాలు పడతాయి. అదే పోగొట్టుకోవాలంటే అర నిమిషం చాలు" అంటూ హితబోధ చేశాను.

"నన్ను క్షమించండి" అంటూ నా కాళ్ళు పట్టుకుంది.

"ఛా...ఛా...ఇవేం పన్లు జానకీ? ఏదో కొడుకు భవిష్యత్తు దెబ్బ తింటుందేమోనన్న బెంగతో అలా అన్నావు కానీ, లేదంటే నువ్వు నన్ను లంచం తీసుకోమని ప్రోత్సహించేదానివి కాదు. ఇన్నాళ్ళ నా నిజాయితీలో నీ సహకారం వుంది కదా! లేదంటే పరిస్థితులు మనిషిని ఎంతకైనా దిగజారుస్తాయి. అలా నేనేం అయిపోయి వుండేవాడ్నో."

"ఇప్పుడు నా బెంగంతా అబ్బాయి గురించేనండి."

నేను చిన్నగా నవ్వి అన్నాను. "ప్రతి సమస్యకూ ఒక పరిష్కారం తప్పకుండా వుంటుంది. నీ చెవి దుద్దులివ్వు. అవి కుదువ పెట్టి అబ్బాయిని బెంగుళూరుకు పంపిద్దాం. రేపు నెలలో జీతం రాగానే విడిపించి ఇస్తాను."

"అంతకంటే భాగ్యమా? ముందు మీరా పని చూడండి" అంటూ తీసిచ్చింది.

నేను డ్రస్సై మార్వాడి షాపు వైపు బయలుదేరాను. సాయంత్రపు చల్లని గాలి నా శరీరానికి తగులుతుంటే హాయిగుంది.

మనసులోని భారం తొలగిపోవడంతో తల తేలికపడి గాలిలో తేలిపోతున్నట్టుంది.

నిజాయితీని నమ్ముకున్న మనిషికి కష్టాలు వుంటాయేమో కానీ అసంతృప్తి మాత్రం అతని దరి చేరదు. ఎంత వున్నా తృప్తి లేని బ్రతుకెందుకు? తృప్తి వుంటే ఏమీ లేకపోయినా పరవాలేదు. ❋


# ప్రియదత్త

## సకుటుంబ సచిత్ర వారపత్రిక

## దీపావళి సంచిక

**06.11.2002**

**ఈ సంచికకి పంపే ప్రత్యేక వ్యాసాలు,**

**శీర్షికలు, కవితలు,**

**కార్టూన్‌లు, ఛాయాచిత్రాలు**

**12.10.2002లోగా అందేలా**

**పంపగోరుతున్నాము.**

*- సం.*